
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 20 డిసెంబరు 2024
5



హలో.. ఎస్ఈ!



విద్యుత్ సమస్యలపై రేపు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు... కరెంట్ తీగలు తెగిపోయి ప్రమాదాలు... ప్రమాద భరితంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు... రోడ్లపైనే విద్యుత్ స్తంభాలు, పలుచోట్ల లోవోల్టేజీలు, ట్రాన్స్‌ఫారాల సమస్యలు.. ఇలా ఎన్నింటితోనే విద్యుత్ వినియోగదారులు సతమతమవుతున్నారు. అలాగే అర్హత ఉన్న వారికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకం అందడం లేదు. విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ కె.సురేందర్‌తో 'ఆంధ్రజ్యోతి' శనివారం 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. విద్యుత్ వినియోగదారులు ఎన్పీడీసీఎల్ ఎస్ఈతో నేరుగా మాట్లాడటం ద్వారా తమ సమస్యలను, సందేహాలను పరిష్కరించుకోవచ్చు.

ఫోన్ ఇన్ తేది
21-12-2024 (శనివారం)
సెల్ నెంబరు
99854 11613
కాల్ చేయాల్సిన సమయం
ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా 'నున్నా'

సత్తుపల్లిలో జరిగిన మహాసభలో రెండోసారి ఎన్నిక

పూర్వ వైభవం కోసం సీపీఎం తహతహ

నేటి నుంచి ఇల్లెందులో భద్రాద్రి జిల్లా మూడో మహాసభలు

6



క్రీడాజ్యోతిని అందిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్రీడాస్ఫూర్తితో ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి...

- విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి
- సంక్షేమ గురుకులాల్లో పీఈటీలు, అధ్యాపకుల కృషి భేష్
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్
- పాల్వంచలో సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం

వివరాలు : 7లో



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

జాతికి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి..

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం
- మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగం చేయాలని చూస్తున్న బీజేపీ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ధ్వజం
- సత్తుపల్లిలో ముగిసిన సీపీఎం 22వ జిల్లా మహాసభలు

వివరాలు : 6లో



మధిరలో నిర్మాణం జరుగుతున్న మూడో రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం ఇతర రైల్వే అధికారులు

త్వరితగతిన అభివృద్ధి పనులు

- రైల్వే స్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దాలి
- డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్
- మధిర, మోటమర్రి రైల్వే స్టేషన్లలో తనిఖీ

మధిర/బోనకల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులతో పాటు మూడో రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. మధిర రైల్వే స్టేషన్‌ను గురువారం ఉదయం ఆయన ప్రత్యేక రైలులో వచ్చి సందర్శించారు. స్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ24 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీచేశారు. ప్రయాణికుల వెయిటింగ్ హాల్, స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత మూడోలైన్ నిర్మాణ పనులను పరిశీలించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్మాణంలో లోపాలు తలెత్తవద్దని, పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం వెంట డీవోఎం సురేష్‌రెడ్డి, సీనియర్ డీసీఎం బాలాజీ కిరన్, సీనియర్ సౌత్ డీఈఎన్, కమర్షియల్ మేనేజర్, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియా అగర్వాల్, మధిర పీడబ్లుఐ మల్లేష్, ఐవోటీ, శ్రీనివాస్, ఖమ్మం ఐపీఎఫ్ అధికారి శ్రీనివాసరెడ్డి, మధిర జీఆర్పీ వేణుగోపాలరెడ్డి, ఉదయ్‌కుమార్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోటమర్రి రైల్వేస్టేషన్‌లో..


బోనకల్ మండలంలోని మోటమర్రి రైల్వే స్టేషన్‌ను గురువారం సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. బోనకల్ రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. మధిర, బోనకల్ తదితర ప్రాంతాలలో అండర్ బ్రిడ్జీల నిర్మాణం కోసం తగు ప్రతిపాదనలను ఇప్పటికే రైల్వేబోర్డుకు పంపించామని తెలిపారు. అనుమతులు రాగానే అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను బోనకల్‌లో హాల్టింగ్ ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరారు.

వాణిజ్య పంటల్లో... ముఖ్యంగా మూనె పంటల్లో ప్రధానమైన వేరుశనగ సాగు ఈ ఏడాది రైతులకు నిరాశనే మిగులుస్తోంది. పెట్టుబడులు భారీగా పెరిగినా దిగుబడులు తగ్గడంతో పాటు మార్కెట్‌లో ధర కూడా తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది. సాగుచేసిన రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. భద్రాద్రి జిల్లాలో వాణిజ్య పంటలకు నిలయమైన అశ్వారావుపేట ప్రాంతంలో వేరుశనగ సాగు భారీగా చేస్తారు. గతేడాది వేరుశనగకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులు కొంత లాభపడ్డారు. కానీ ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో దిగుబడి తగ్గింది. అదే సమయంలో పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో రైతులకు అప్పులు మిగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



పొలంలో వేరుశనగ పంట

ప్రకృతి కాటు...



వేరుశనగ.. భోరుమనగ..

- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- ఎకరానికి 10 క్వింటాళ్లు మించని వైనం
- వాతావరణం అనుకూలించక పోవడమే కారణం
- రూ.8వేల నుంచి రూ.6.500కు పడిపోయిన ధర
- సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్న వ్యాపారులు
- అప్పులే మిగులుతాయని రైతుల ఆందోళన

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 19: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, నారాయణపురం, పండువారిగూడెం, అల్లిగూడెం, దబ్బతోగు, రామన్నగూడెం, గాండ్లగూడెం, అనంతారం, దిబ్బగూడెం, కావడిగుండ్ల, కన్నాయిగూడెం వంటి ప్రాంతాల్లో ఏటా వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రెండు పంటలు కూడా వేరుశనగనే సాగు చేస్తారు. మండలం మొత్తం సుమారు 4వేల ఎకరాల్లో వేరుశనగ సాగవుతోంది. పంట బాగా పండితే ఎకరానికి 15క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. గత సెప్టెంబరులో అధికంగా వర్షాలు కురవడంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో దిగుబడి ఎకరానికి 10క్వింటాళ్ల లోపే వస్తోంది. కొద్ది మంది రైతులు మాత్రమే 12క్వింటాళ్ల వరకు దిగుబడి సాధిస్తున్నారు.

పడిపోయిన ధర

గతేడాది వేరుశనగ ధర క్వింటాలుకు రూ.8వేల వరకు పలకగా ప్రస్తుత రూ.6,500కు తగ్గింది. ఇతర ప్రాంతాల్లో ధరలు కొంత మెరుగ్గా ఉన్నా అశ్వారావుపేట ప్రాంతంలో పెట్టుబడిదారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు కుమ్మక్కు కావడంతో ధర ఏమాత్రం పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను ఇతర ప్రాంతాల వారికి అమ్ముకుందామనుకున్నా పెట్టుబడి పెట్టిన వ్యాపారులు ఊరుకునే పరిస్థితి లేదని, తద్వారా వారు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఎకరానికి రూ.90వేల పెట్టుబడి

వేరుశనగ సాగుకు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు భారీగా పెరిగిపోయాయి. వీటన్నింటికి మించి కౌలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రస్తుతం అశ్వారావుపేట ప్రాంతంలో ఎకరం కౌలు ధర రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఉంది. ఎకరం వేరుశనగ సాగు చేయటానికి అయ్యే ఖర్చులను పరిశీలిస్తే విత్తనాలకు (మిగతా 6వ పేజీలో)

భళా... ఇల్లెందు మునిసిపాలిటీ!

- సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేటగిరీలో జాతీయ అవార్డు
- కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకున్న కమిషనర్ శ్రీకాంత్



అవార్డు అందుకుంటున్న మునిసిపల్ కమిషనర్, మేనేజరు

ఇల్లెందు టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పురపాలక సంఘానికి మరో పర్యాయం జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాక్షన్‌ప్లానింగ్ ఈవెంట్‌లో దేశంలో 4,633 మునిసిపాలిటీలో పోటీ పడగా అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 100 మునిసిపాలిటీలను కేంద్రం ఎంపిక చేసింది. వీటిలో ఇల్లెందు మునిసిపాలిటీ ఉండటం ప్రత్యేకతను చాటుకుంది. ఈ మేరకు కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డును మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజరు అంకుషావళి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు అతహర్ గురువారం అందుకున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షన్ తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి 2021 నుంచి 2024 వరకు ఇల్లెందు మునిసిపాలిటీలో రూపొందించిన కార్యాచరణ ప్రకారం పలు కార్యక్రమాలు నిర్వహించి రిపోర్టును అందజేశారు. ఈ రిపోర్టు ఫలితంగా ఉత్తమ మునిసిపాలిటీగా జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం పట్ల చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతోపాటు పలువురు అధికారులు హర్షం వ్యక్తం చేశారు.




శ్మశానంలో మగ శిశువు

- ఏడుపు విని గుర్తించిన జనం
- కొత్తగూడెంలో కలకలం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ఓ నవజాత మగశిశువును శ్మశాన వాటికలో వదిలి వెళ్లారు. పట్టణంలోని న్యూ గొల్లగూడెంలోని శ్మశాన వాటిక నుంచి ఉదయం 7:30గంటల సమయంలో పసిబిడ్డ ఏడుపు వినిపించడంతో స్థానికులు వెళ్లి చూడగా ఓ సమాధిపై నవజాత మగశిశువు కనిపించాడు. వెంటనే వారు కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహకారంతో ఆ శిశువును రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ శిశువును పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగానే ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు డీసీపీవో(డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్) హరికుమారికి సమాచారం అందజేశారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీసుల సమక్షంలో వైద్య సిబ్బంది ఆ శిశువును డీసీపీవోకు అందజేశారు. తరువాత భద్రాచలం శిశు గృహానికి తరలించారు. కొత్తగూడెం సీడీపీవో విజయకుమారి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లబ్ధిదారులతో అధికారుల ఆటలు

- గడువు ముగిసే రోజు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- మూడు నెలలుగా మాగబెట్టి పంపిణీ చేయని వైనం
- చెక్కులను స్వీకరించేందుకు నిరాకరించిన బ్యాంకు సిబ్బంది
- లబ్ధిదారుల అయోమయం... అధికారుల తీరుపై నిరసన



కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం.

సెప్టెంబరు 19వ తేదీతో జారీ చేసిన చెక్కు

సత్తుపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులకోసం లబ్ధిదారులు రోజుల తరబడి ఎదురు చూస్తుండగా చివరికి గడువు ముగిసేరోజు చెక్కులు ఇచ్చి సత్తుపల్లి రెవెన్యూ సిబ్బంది చేతులు దులుపుకొన్నారు. చెక్కులు కలెక్షన్ చేయటానికి బ్యాంకు అధికారులు నిరాకరించటంతో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

13 మందికి చెక్కుల పంపిణీ

స్థానికఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సత్తుపల్లి గిర్దావర్ పర్యవేక్షణలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 13 మందికి ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులను పంపిణీ చేసిన ఈ కార్యక్రమంలో అధికార పార్టీకి చెందిన నాయకులు కూడా పాల్గొన్నారు. విచిత్రం ఏమిటంటే ఈ చెక్కుల గడువు కూడా గురువారమే (డిసెంబరు 19) కావడం గమనార్హం. వాస్తవానికి గత సెప్టెంబరు 19వ తేదీ రాసిన చెక్కులు స్థానిక మండలం రెవెన్యూ కార్యాలయానికి చేరాయి. వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా నెలల తరబడి కార్యాలయంలో ఉంచుకున్నారనే ఆరోపణలున్నాయి. చెక్కులను లబ్ధిదారులు నగదుగా మార్చుకునేందుకు మూడు నెలల సమయం మాత్రమే ఉంటుంది. చెక్కు మనుగడ మూడు నెలలు మాత్రమే అని స్పష్టంగా చెక్కుపై రాసి ఉంది. అయినా నెలల తరబడి జాప్యం చేసిన రెవెన్యూ సిబ్బంది... చివరికి గురువారం లబ్ధిదారులను అరగంటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకోవాలని హడావిడిగా పిలిపించారు. అక్కడ నాయకుల సమక్షంలో చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులను తీసుకొని బ్యాంకుకు వెళ్లిన లబ్ధిదారులకు చుక్కెదురయింది. చెక్కు కాలపరిమితి ముగిసిందని చెప్పి బ్యాంకు సిబ్బంది (మిగతా 6వ పేజీలో)



కొత్తగూడెంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలో మాట్లాడుతున్న పాల్

చిరుద్యోగుల బాధలు కనిపించడం లేదా?

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి..
- అవసరమైతే సీఎంను మార్చాలని ఆందోళనలకు దిగుతాం
- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్
- కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద దీక్షలకు సంఘీభావం

కొత్తగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'చిరుద్యోగుల బాధలు నీకు ఎంత మాత్రం కనిపించడం లేదా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 30 రోజుల్లో వారి సమస్యలను పరిష్కరించాలి..' అని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చొని ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజుల సమయం ఇస్తున్నాం.. ఆ తర్వాత హైదరాబాద్‌లో లక్షమంది ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ మార్పు రాకపోతే, సీఎంను మార్చేందుకు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు సిద్ధమన్నారు. ఇలాంటి చిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తే దేవుడు మిమ్మల్ని దీవిస్తాడని, లేకపోతే అదే దేవుడు మిమ్మల్ని పదవి నుంచి తీసివేస్తారని సీఎంను ఉద్దేశిస్తూ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆదాయం పెరిగితే మరింత (మిగతా 6వ పేజీలో)

వరద కష్టాలకు చెక్

- భద్రాచలంలో గోదావరి చెంతన కరకట్ట విస్తరణకు రూ.4,500 కోట్లతో అంచనాలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన నీటిపారుదల శాఖ
- పోలవరం బ్యాక్ వాటర్ సమస్యకు శాశ్వత పరిష్కారం

7

చకచకా ముక్కోటి ఏర్పాట్లు

- ఉత్తర ద్వారానికి రంగులు వేస్తున్న సిబ్బంది
- మందకొడిగా ఉత్తరద్వార దర్శనం టికెట్ల విక్రయాలు
- ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 395 టికెట్ల అమ్మకం
- ఈ నెల 31 నుంచి మహోత్సవాలు

6



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- సత్తుపల్లిలో సీపీఎం 22వ జిల్లా మహాసభలు

సత్తుపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానపరుస్తూ పార్లమెంట్‌లో చేసిన అనుచితవ్యాఖ్యలకు సిగ్గుపడాలని, వీటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ క్రమంలో ఆయన జాతికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. సత్తుపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీపీఎం 22వ ఖమ్మం జిల్లా మహాసభలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన ప్రసంగిస్తూ అంబేద్కర్ ఈ దేశానికి ఎంతో సేవ చేశారని, దళితుల అభ్యున్నతి కోసం, హక్కుల కోసం పోరాడారని, అంతేకాకుండా దేశ ప్రజలను ఎలా పరిపాలించాలని సమానత్వ సిద్ధాంతాలను ముందుకు తీసుకొచ్చారన్నారు. రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం గురించి, కులాల మధ్య వ్యత్యాసాలు, ఆర్థిక అసమానతలను క్రమంగా ఎలా తగ్గించాలని, ప్రాథమిక హక్కుల గురించి అంబేద్కర్ తన జీవితాంతం కృషి చేశారన్నారు. ఇంత చరిత్ర ఉన్న మహోన్నత వ్యక్తిని చులకన చేస్తూ ఈ రోజు బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని ఉంచాలనేది బీజేపీ కుట్ర అన్నారు. అనుకోకుండా మాటజారడం కాదని, మనసులో ఉన్న మాట బీజేపీ బయటపెట్టిందన్నారు. దీనికి పైపై సూచనలు చేస్తూ ప్రధానమంత్రి మోదీ సమర్థిస్తూ ప్రకటన చేయడంగానీ, తక్కువచేసి చూడటంగానీ కర్తవ్యం కాదన్నారు. తక్షణమే దీనిపై చర్చ జరగాలని, జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, నిరసనలు చేపట్టాలని ప్రజా సంఘాలు పిలుపునిస్తున్నట్టు తెలిపారు.

సత్తుపల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

రాజ్యాంగాన్ని చులకనగా చేసి మాట్లాడటం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కించపరుస్తూ పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్ ఎదుట ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేద్కర్ మన దేశ భవిష్యత్ కోసం నిర్మించిన రాజ్యాంగం ప్రకారం జరిగిన ఎన్నికల్లో గెలుపొంది ఆ నిర్మాతనే కించపరచడం అవివేకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కార్యక్రమంలో బీ.వెంకట్, పోతినేని సుదర్శనం, నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు, మాచర్ల భారతి, భుక్యా వీరభద్రం, కల్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మా విష్ణు, ఎర్రా శ్రీకాంత్, ఎర్రా శ్రీనివాసరావు, కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి పాండురంగారావు, చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీనివాసరావు, రావుల రాజబాబు పాల్గొన్నారు.

పెద్దపులి జాడ కోసం...

- మోతే అడవిలో పులిని గుర్తించిన మేకల కాపరి
- రిజర్వు ఫారెస్టు పరిధిలో గాలింపులు
- మళ్లీ వచ్చిందని ప్రకటించిన అటవీశాఖ అధికారులు

కరకగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలో పలు రోజులుగా పెద్దపులి సంచరించడంతో రెండు జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రత్నగిరి టైగర్‌జోన్ నుంచి ములుగు జిల్లా వాజేడు అటవీ ప్రాంతం నుంచి మంగపేట, మల్లూరు, తాడ్వాయి నుంచి కరకగూడెం మండలం, జానంపేట రిజర్వు ఫారెస్టులోకి పెద్దపులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల గొల్లగూడెం నార్త్ బీట్ కంపార్టుమెంట్ - 2 పంగల్ వాగులో పెద్దపులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించగా మళ్లీ అక్కడ నుంచి ములుగు జిల్లా కౌశెట్టివాయి, నర్సపూర్ వెళ్లడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం మళ్లీ తిరిగి కరకగూడెం మండలం మోతే అటవీలో పెద్దపులిని మేకల కాపారి గుర్తించారు. గురువారం ఏడూళ్లబయ్యారం రేంజర్ ఉపేందర్, సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, సూరయ్య, రామదాసు, ఏడుకొండలు సిబ్బంది ఆధ్వర్యంలో మోతే, రఘునాథపాలెం అటవీ ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దపులి పాద ముద్రలు సేకరించిన అధికారులు ఆ ప్రాంతంలో మణుగూరు డీఎఫ్‌వో ఆదేశాల మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణుగూరు డీఎఫ్‌వో సయ్యద్ మక్సూద్ మొహిద్దిన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. డిసెంబరు నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు ఆడపులి కోసం పెద్దపులి ఈ ప్రాంతాల్లో సంచరిస్తుందన్నారు. ప్రస్తుతం కరకగూడెం, పినపాక, గుండాల, తాడ్వాయి అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోందన్నారు.



పెద్దపులి పాదముద్రలు గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు



సీపీఎం జిల్లా కార్యదర్శిగా నున్నా నాగేశ్వరరావు

సత్తుపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శిగా నున్నా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధ, గురు వారాల్లో రెండు రోజులపాటు సత్తుపల్లిలో నిర్వహించిన 22వ ఖమ్మం జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, కల్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, భూక్యా వీరభద్రం, యనమదల విక్రమ్, బొంతు రాంబాబు, బండి పద్మ, యర్రా శ్రీనివాసరావులతో పాటు మరో 31మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసిన అనంతరం ప్రజా పోరాటాలపై నిత్యం ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

'సీతారామ'కు అవసరమైన భూములివ్వండి

గ్రామసభలో కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి అవసరమైన భూములను రైతులు ఇవ్వాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ కోరారు. గురువారం పెనుబల్లి, లింగగూడెం, గౌరారం గ్రామాల్లో సీతారామ ప్రాజెక్టు క్వాల నిర్మాణ కోసం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి అవసరమైన భూములను రైతులు ఇవ్వాలని, దీంతో ప్రాజెక్టు పూర్తి అయి నీరు త్వరగా వచ్చి సస్యశ్యామలం చేస్తుందన్నారు కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఐబీ డీఈ నాగేశ్వరరావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు
ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరు వైకల్యం, ప్రాణాలు కోల్పోకుండా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల వివరాలు నమోదు చేయాలని, ప్రమాదాలు జరగకుండా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని, ఓవర్‌లోడింగ్ వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలని రవాణాశాఖాధికారికి సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈ.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ కాశయ్య, నేషనల్ హైవే ఈఈ యుగంధర్, జిల్లా వైద్యశాఖాధికారి భాస్కర్‌నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి, జిల్లా రవాణాశాఖాధికారి సదానందం, డీసీహెచ్ఎస్ రవి బాబు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

సామాన్యులను ఇబ్బందిపెట్టే వారిపై చర్యలు తీసుకోవాలి

నేర సమీక్షలో ఎస్పీ రోహిత్‌రాజ్



సామాన్యులను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీసు అధికారులకు సూచించారు. గురువారం ఎస్పీ జిల్లాలోని పోలీసు అధికారులతో పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నేర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభకనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, బెట్టింగులు లాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జమలాపురం' హుండీ ఆదాయం
రూ. 31,64,525



ఎర్రుపాలెం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కానుకల హుండీని ఆలయ అధికారుల సమక్షంలో సిబ్బంది గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి పర్యవేక్షణలో భక్తులు శ్రీవారికి సమర్పించిన కానుకలు, ముడుపులు 85రోజులకు గాను రూ.31,64,525లు వచ్చినట్లు ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూరింటెండెంట్ కె.విజయకుమారి, ఆలయ ప్రధాన అర్చకులుఉప్పల శ్రీనివాసశర్మ, ఉపప్రధాన అర్చకులు విజయదేవశర్మ, శ్రీసత్యసాయి సేవా సమితి తదితరులుపాల్గొన్నారు.



చకచకా ముక్కోటి ఏర్పాట్లు

భద్రాచలం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో, వైకుంఠ ద్వారంకు రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. ఉత్తర ద్వారం రంగులు వేయడంతో పాటు, తలుపులకు పాలీష్ వేసే పనులు కొనసాగుతున్నాయి. అలాగే ప్రధాన ఆలయంలో భద్రుని కోవెల, ఆలయ ప్రహరీ గోడలకు రంగులు వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే గోదావరి నదీ తీరంలో ర్యాంపు ఏర్పాటు, స్థల పరిశీలన జరిగింది. అలాగే స్వాగత ద్వారాల ఏర్పాటు, చలువ పందిళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఉత్తర ద్వార దర్శనం టికెట్ల విక్రయాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా అవి మందకొడిగా విక్రయించబడుతున్నాయి. 21.5 శాతం మాత్రమే అమ్ముడయ్యాయి. భద్రాచలంలో జనవరి 10న ముక్కోటిని పురస్కరించుకొని నిర్వహించే భద్రాద్రి రామయ్య ఉత్తరద్వార దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు 395 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. మొత్తం 1840 టికెట్లు భక్తులు కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా 395 టికెట్లు గురువారం వరకు కొనుగోలు చేశారు. ఇందులో రూ.2 వేలు విలువ గల వీఐపీ సెక్టారు టికెట్లు 650 టికెట్లు అందుబాటులో ఉంచగా 133 కొనుగోలు చేయగా 517 ఉన్నాయి. అలాగే రూ.1000 విలువ గల ఏ సెక్టారు టికెట్లు 200 అందుబాటులో ఉంచగా 87 టికెట్లు కొనుగోలు చేయగా 113 ఉన్నాయి. బీ సెక్టారు రూ.500 విలువ గల బీ,సీ,డీ, సెక్టార్ల టికెట్లు 665 అందుబాటులో ఉండగా 147 టికెట్లు మాత్రమే భక్తులు కొనుగోలు చేశారు. 518 టికెట్లు ఇంకా అందుబాటులో ఉన్నాయి. రూ.250 విలువ గల ఈ సెక్టారు టికెట్లు 325 ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా కేవలం 28 టికెట్లు మాత్రమే విక్రయించబడ్డాయి. ఇంకా 297 టికెట్లు అందుబాటులో ఉన్నాయి.



నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి చిననల్లబల్లి తాలి పేరు ప్రధాన కాల్వ వద్ద ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం ఇరవై లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. సారాను రవాణా చేస్తున్న ఆటోను సైతం స్వాధీనం చేసుకున్నారు. సారా రవాణా చేస్తున్న పాతజిన్నెలగూడెం, వీరభద్రాపురం గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. దాడుల్లో ఎస్ఐ అల్లూరి సీతారామరాజు, హెచ్‌సీ అలీమ్, పీసీలు బాబు, వీరబాబు, రాకేష్, లలిత, కిరణ్‌లు పాల్గొన్నారు.

వేరుశనగ.. భోరుమనగ..

(5వ పేజీ తరువాయి)

రూ.16వేలు, పురుగు మందులు, ఎరువులు రూ.30వేలు, పంటను తీసేందుకు రూ.6వేలు, మిషన్‌కురూ.6,500, ఇతర ఖర్చులు మరో ఐదారు వేల వరకు ఉంటాయి. ఇవి కాకుండా ఒక పంటకు పొలం కౌలు రూ.20వేలు ఉంటుంది. అంటే ఒక రైతు ఎకరం పొలం కౌలుకు తీసుకొని ఒకసారి వేరుశనగ సాగు చేస్తే సుమారు రూ.90వేల పెట్టుబడి ఖర్చు వస్తుంది. ఇక దిగుబడి 12 క్వింటాళ్లు వచ్చినా ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం వచ్చే ఆదాయం రూ.78వేలే.. అంటే కౌలురైతుకు పెట్టుబడి కూడా రావట్లేదు. సొంత పొలంలో సాగు చేసిన రైతుకు పెట్టిన పెట్టుబడికి, వచ్చే ఆదాయానికి సరిసమానంగా ఉంటుందే తప్ప లాభం ఏమీ ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. కానీ దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండి ధర బాగా ఉంటే వేరుశనగ లాభాలు కురిపిస్తుందంటున్నారు.

లాభాలు వచ్చే పరిస్థితి లేదు..

నారం రామారావు, రైతు దిబ్బగూడెం

వేరుశనగ సాగు వల్ల గతంలో కొంతలాభమే ఉండేది. కానీ ఈసారి మాత్రం వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి పది క్వింటాళ్లకు పడిపోయింది. ఈ క్రమంలో ధర కూడా తగ్గడంతో లాభం వచ్చే పరిస్థితి లేదు. మేము సొంత పొలంలో సాగు చేయడంతో పెట్టుబడులైనా వచ్చే పరిస్థితి ఉంది. అదే కౌలుకు చేసి కూలీలతో పనులు చేయించిన వారికి నష్టాలు తప్ప మిగిలేది ఏమీ ఉండదు.

జడ్పీ డిప్యూటీ సీఈవోగా నాగపద్మజ బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోగా కె నాగపద్మజ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె జడ్పీలో తన చాంబర్‌లో దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం జడ్పీ సీఈవో దైనాదీక్షను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆ తర్వాత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డిప్యూటీ సీఈవోను కార్యాలయం పర్యవేక్షకులు మధు, రమాదేవి, విజయలక్ష్మీ, రమణ, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగపద్మజ

లబ్ధిదారులతో అధికారుల ఆటలు

(5వ పేజీ తరువాయి)

చెక్కును తిరస్కరించారు. తుది గడువుకు కనీసం మూడు రోజుల ముందు చెక్కు కలెక్షన్‌కు ఇవ్వాలని బ్యాంకు సిబ్బంది చెప్పినట్లు లబ్ధిదారుల కుటుంబసభ్యులు చెపుతున్నారు. దీంతో లబ్దిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. కాలపరిమితి తీరిన చెక్కులు పంపిణీ చేయటంపై లబ్దిదారుల కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేసారు. చెక్కులు కార్యాలయానికి చేరిన తరువాత కూడా రోజుల తరబడి ఎందుకు నిర్లక్ష్యం చేసారనే విమర్శలు వస్తూండగా ఎవరి మెప్పుకోసం ఇలా చేసారనేది చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా గడువు తీరిన చెక్కులు ఇచ్చి యంత్రాంగం అభాసుపాలైంది. దీనిపై గిర్దావర్ జానీని సంప్రదించగా చెక్కులన్నింటినీ వెనక్కి తీసుకుని ఆర్డీవో కార్యాలయానికి పంపామని కొత్త చెక్కులు వచ్చిన వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేస్తామన్నారు.

చిరుద్యోగుల బాధలు కనిపించడం లేదా?

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాశాంతి పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇటీవల కాలంలో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో సమావేశమై కోర్టులో న్యాయం జరిగేలా పోరాటాలు చేయడంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసిందని తెలిపారు. రైతులకు రుణ మాఫీ జరిగినట్టు తెలిపారు. సమగ్రశిక్షా ఉద్యోగులతో ఐక్యంగా పోరాడటానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు ఇద్దరు యువకుల ఎంపిక

జూలూరుపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీఎంకప్ కబడ్డీ క్రీడా పోటీలకు మండలంలోని సూరారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. కొత్తగూడెంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో బచ్చల బాలు, కొండెం సాయికుమార్ పాల్గొని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఈ నెల 27వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీల్లో ఇద్దరు యువకులు పాల్గొనున్నారు. వారిద్దరిని తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంఈఓ జుంకీలాల్‌లు అభినందించారు.

పూర్వ వైభవం కోసం తహతహ

- నేటినుంచి ఇల్లెందులో సీపీఎం భద్రాద్రి జిల్లా మూడో మహాసభలు
- భద్రాద్రి జిల్లా పరిధి నుంచి 11 పర్యాయాలు అసెంబ్లీకి ప్రాతినిథ్యం
- రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన పార్టీ
- పార్టీ బలోపేతానికి వ్యూహాత్మక చర్యలు

ఇల్లెందు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఆరు దశాబ్దాలుగా అలుపెరుగని పోరుసాగిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్)ఇల్లెందు పట్టణంలో శుక్రవారం నుంచి భద్రాది కొత్తగూడెం జిల్లా మూడో మహాసభలు జరుపుకుంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎంకు భద్రాది జిల్లా పెట్టని కోటగా ఉండేది. ఆదివాసులు గిరిజనులు కొండరెడ్లు, సింగరేణి బొగ్గుగనుల కార్మికులు, వ్యవసాయ కూలీల సమస్యలపై అనేక పోరాటాలు నిర్మించిన సీపీఎం గతంలో భద్రాచలం ఇల్లెందు శాసనసభ నియోజకవర్గాల్లో తిరుగులేని విజయాలు సాధించిన ఖ్యాతి గడించింది.

జిల్లా మహాసభలు ప్రప్రథమంగా నిర్వహిస్తున్న ఇల్లెందు నియోజకవర్గంలో కేఎల్ నర్సింహరావు 1952లో, 1957లో, 1962లో కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థిగా మూడు పర్యాయలు విజయాలు సాధించారు. అదేవిధంగా జిల్లాలోని భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో ముర్ల యర్రయ్యరెడ్డి 1978లో, 1983లో రెండు పర్యాయాలు, కుంజా బుజ్జి 1985, 1989, 1994లో మూడు పర్యాయలు, సున్నం రాజయ్య 1999లో, 2004లో, 2014లో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. అంతేగాక 2004లో భద్రాచలం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి సీపీఎం నేత మీడియం బాబురావు ఎంపీగా గెలుపొందారు. 1987లో ఇల్లెందు మునిసిపల్ చైర్మన్‌గా సీపీఎం నేత వై. వినయ్‌కుమార్‌తో పాటు జడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా, సర్పంచ్‌లుగా పదుల సంఖ్యలో సీపీఎం నాయకులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. భద్రాది కొత్తగూడెం జిల్లా నుంచి సీపీఎం నాయకులు 11 పర్యాయాలు శాసనసభలో ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించారు.

రాష్ట్ర విభజనతో తీవ్ర నష్టం

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రాబల్యం కలిగిన సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ విభజనలో తీవ్రంగా నష్టపోయింది. విభజనలో ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం ఆ పార్టీని కుంగదీసింది. భద్రాచలం శాసనసభ నియోజకవర్గంలోని కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, భద్రాచలంలో అత్యధిక భాగం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయడంతో సీపీఎంకు రాజకీయం గా తీవ్ర నష్టం జరిగింది. 8పర్యాయాలు ఎమ్మెల్యేలను, ఒక పర్యాయం ఎంపీని గెలిపించుకున్న భద్రాది కొత్తగూడెం జిల్లా లో విలీనం వేటుకు అసెంబ్లీ సెగ్మెంట్ కకావికలం కవడంతో నేడు సీపీఎం ఉనికికోసం, పట్టు కోసం ఎదురీదుతుంది.

హత్యలకు గురైన నేతలు

గోదావరి నది పరివాహక ప్రాంతాలు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాలతో కూడిన జిల్లాలో మావోయిస్ట్ నక్సల్స్ చేతిలో హత్యలకు గురైన రాజకీయ పార్టీల నాయకుల్లో అత్యధికులు సీపీఎం నాయకులే కావడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆధిపత్య పోరు మూలంగా మావోయిస్ట్ నక్సల్స్ చేతిలో భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్ కీలక నాయకులు బండారు చందర్‌రావు, బత్తుల భీష్మరావు, శ్యామల వెంకటరెడ్డి, పులి రామయ్య, మడకం గంగారాజు, ఇర్పా వీరయ్య, కుంజ సీతారామయ్య, ఖాజావలి తదితర 15మంది హత్యలకు గురయ్యారు.

ప్రాధాన్యత సంతరించుకున్న జిల్లా మహాసభలు

భద్రాది కొత్తగూడెం జిల్లా ఆవిర్భావం తర్వాత సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు 2017లో భద్రాచలంలో జరిగాయి. రెండో జిల్లా మహాసభలు 2021లో ఆశ్వారావుపేటలో ఏర్పాటు చేయగా కరోనా మూలంగా అనుమతి లభించకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌లోని జిలుగుమిల్లి మండలంలో జరిపారు. మూడో జిల్లా మహాసభలు ఇల్లెందులో ఈనెల 20, 21 తేదిల్లో జరుపుతున్నారు. సీపీఎం నాయకత్వం వ్యూహాత్మకంగానే ఇల్లెందులో జిల్లా మహాసభలు జరపాడానికి నిర్ణయించుకున్నట్లు సమాచారం. 1952 నుంచి వరుసగా మూడు పర్యాయాలు సీపీఎం నేత దివంగత కేఎల్.నర్సింహరావు ఎమ్మెల్యేగా మూడు సార్లు విజయాలు సాధించడం, 1987లో ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ పదవిని గెలిపించుకోవడం, పలు మండలాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిదులు ఉండ డం, బొగ్గుగని కార్మికులతో ఉద్యమాల అనుబంధం కారణంగానే సీపీఎం నాయకత్వం ఇల్లెందుపై దృష్టి సారించి సభలు జరపాడానికి ఎంచుకున్నట్లు తెలిసింది. మహాసభల సందర్భంగా ఇల్లెందు పట్టణాన్ని ఆరుణపతాకలతో అలంకరించారు.జండాలు తోరాణాలతో పట్టణంలోని వివిధ కూడళ్లను ఆరుణమయం చేశారు. మహసభలను 24ఏరియా సింగరేణి కమ్యూనీటీహాల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మహసభలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని ఆహ్వాన సంఘం తెలిపింది.





జ్యోతిప్రజ్వల చేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, పూర్వ జేడీ లక్ష్మీనారాయణ

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతోనే

లక్ష్య సాధన సులభం

జేడీ లక్ష్మీనారాయణ, శ్రీచైతన్యలో ముగిసిన వ్యక్తిత్వ వికాస తరగతులు

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతోనే లక్ష్యసాధన సులభతరం అవుతుందని పూర్వ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు.గురువారం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ప్రాంగణంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాలల వ్యక్తిత్వ వికాస తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత విద్యాసంస్థల చెర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ముఖ్య అతిధి లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలో ఒక విశిష్ఠమైన సామర్థ్యం ఉంటుందని, అదిసందర్భానుసారం ప్రదర్శించినప్పుడు వారి తల్లితండ్రులకు, గురువులకు సమాజానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ఏకాగ్రతను సరైన మార్గంలో ఉంచుకోవటం ద్వారా అసాధారణ ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలంటే ఏకగ్రతకు భంగం కలిగించే సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ పోటీ పరీక్షలలో ఎదురయ్యే ఒత్తిడిని తొలిగించి విద్యార్థులో మానసిక ఉత్సాహంతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించటానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలను సందర్శించారు.విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీజీఎం చేతన్ మాధుర్, ఎగ్జిక్యూటివ్‌డీన్ ఎన్‌ఆర్ఎస్‌డీ.వర్మ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం,జి.గోపాలక్రిష్ణ,జి.ప్రకాష్, జోనల్ ప్రిన్సిపాల్ యం.రత్నారనవావే పాల్గొన్నారు.

విద్యుత్తు యూనిట్లు నెలకొల్పాలి: పీవో

భద్రాచలం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూముల్లో పీఎం కుసుమ్ పథకం ద్వారా సోలార్ విద్యుత్తు యూనిట్లు నెలకొల్పేందుకు అధికారులు చొరవ చూపాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయం నుంచి విద్యుత్తు, వ్యవసాయం, రెవిన్యూ అధికారులు, ఐకేపీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. సబ్ స్టేషన్లకు మూడు కి.మీ. పరిధిలో ఉన్న పోడు భూములకు సంబంధించి గిరిజన రైతు పట్టా భూములను గుర్తించి సోలార్ విద్యుత్తు యూనిట్లను నెలకొల్పేవిధంగా చూడాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో పరిధిలోని ఇందిర మహిళ శక్తి పథకం కింద స్వయం సహాయక మహిళ గ్రూపులకు సోలార్ విద్యుత్తు యూనిట్లను అనువైన ప్రదేశాల్లో నెలకొల్పాన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, డీటార్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ వేణు, ఏఈ మునీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

27, 28న ఆర్టీసీ కార్గో పార్సిళ్ల వేలం

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కొత్త బస్టాండ్‌లో గల కార్గో పార్సిల్ కొరియర్ సర్వీస్ కౌంటర్లో తీసుకెళ్లని వస్తువులను వేలంపాట నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ వరంగల్ ఖమ్మం జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ వి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ వస్తువులు, ఐరన్, ద్విచక్రవాహన విడిభాగాలు, కంప్యూటర్ విడిభాగాలు, దుస్తులు, ప్లాస్టిక్, ఫెర్టిలైజర్స్, గృహ అవసర వస్తువులు, టైర్లు, మొదలైనవి ఉన్నాయన్నారు. వేలంపాట ఈనెల 27, 28న రెండు రోజులు ఖమ్మం కొత్త బస్టాండ్ కార్గోఆవరణంలో ఉదయం 11గంటల నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ముందస్తు డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ బహిరంగ వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చు అని తెలిపారు. ఆసక్తి కలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడాస్ఫూర్తితో ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- సంక్షేమ గురుకుల విద్యాలయాల రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

పాల్వంచరూరల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ గురుకుల క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభను చాటి రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకురావాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రసోషల్ వెల్ఫేర్ క్రీడాపోటీలను గురువారం క్రీడాజ్యోతిని కలెక్టర్ వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికి తీయడంలో సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది కృషి ఆదర్శనీయమన్నారు. అంతర్జాతీయ వేదికలపై గురుకుల విద్యార్థులు ప్రతిభను కనబర్చడం వీరి కృషికి నిదర్శనమని చెప్పారు. చదువుతోపాటు క్రీడల్లో కూడ అత్యున్నత స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు చెడువ్యసనాల నుంచి దూరం చేసేందుకు ఎంతో దోహదపడతాయని ఆయన చెప్పారు. 7జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీతత్వంతో ఆడాలని, గెలుపు ఓటములు సహజంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పండుగ వాతావరణంలో క్రీడాపోటీలు..
గురుకులాల డిప్యూటీ సెక్రటరీ సక్రునాయక్

రాష్ట్రస్థాయి గురుకులాల క్రీడాపోటీలు పండుగ వాతావరణంలో పాల్వంచలో జరగడం ఎంతో ఆనందంగా ఉందని గురుకులాల రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ సక్రునాయక్ తెలిపారు. క్రీడా ప్రారంభోత్సవలో ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం పాఠశాలల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 26కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి జాతీయస్థాయిలో రాష్ట్రప్రతిష్ఠతను చాటుతున్నామని చెప్పారు. గురుకుల విద్యార్థులు ఏటా జరిగే గురుకులాల రాష్ట్రపోటీల్లో మొదటిస్థానంలో విజయాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్టీజోనల్ అధికారి కే.అలివేలు, భద్రాద్రి జోనల్ అధికారి స్వరూపరాణి, జోనల్ అధికారులు ప్రత్యూష, పాల్వంచ గురుకుల ప్రిన్సిపాల్ పీవీఎన్. పాపారావు, ప్రిన్సిపల్ కన్నెకంటి వెంకటేశ్వర్లు, ఖమ్మం డీసీవో రాజ్యలక్ష్మి, సీనియర్ ప్రిన్సిపల్ ఎస్‌పి.రాజు, సక్ల శంకర్, కే.వాసు, ఈ.శ్రీనివాసు, సైదులు పాల్గొన్నారు.

మొదటిరోజు క్రీడలు

తొలిరోజు క్రీడాపోటీల్లో కాళేశ్వరం, బాసర, రాజన్నసిరిసిల్ల, భద్రాద్రికొత్తగూడెం, యాదాద్రి, చార్మినార్, జోగులాంబ జిల్లాల నుంచి పాల్గొన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 800, 1500మీటర్లు, రన్నింగ్, 5కే, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో ఈవిభాగాలల్లో 1358మంది విద్యార్థులు పాల్గొన్నారు.



వందన సమర్పణ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్,



భద్రాద్రి- జోగులాంబ జట్ల కబడ్డీ పోటీ

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సీఎంకప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం జిల్లాలోని 21మండలాల నుంచి సుమారు 687మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో భాగంగా నాల్గవరోజు ఆర్చరీ(బాలురు,బాలికలు),వాలీబాల్(ఉమెన్), హ్యాండ్‌బాల్(ఉమెన్), తైక్వాండో(మెన్), నెట్‌బాల్(మెన్, ఉమెన్), ఫుట్‌బాల్(మెన్, ఉమెన్)విభాగాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. పోటీలను జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు షఫీ, సాంబమూర్తి, ఆదర్శ్ కుమర్, కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, నగేష్, రామ్‌రాయల, కైలాష్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి

నాల్గో రోజు విజేతలు వీరే

ఆర్చరీ రికర్వ్ బాలికల విభాగంలో ఔచిత్య ప్రథమ, నిషిత ద్వితీయ, నాస్రీరీనా తృతియ స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో యోగంధర్ ప్రథమ, సాయినిఖిల్ ద్వితీయ, వర్ధన్ తృతియ స్థానాల్లో నిలిచారు.

ఆర్చరీ ఇండియన్‌రౌండ్:

జ్యోత్స్న ప్రథమ, అశ్మికప్రకాశ్ ద్వితీయ, యశ్వితరెడ్డి తృతియ స్థానాల్లో నిలవగా, బాలుర విభాగంలో భార్గవ్ ప్రథమ, అనిల్‌కుమార్ ద్వితీయ, ఉమేష్‌కుమార్ తృతియ స్థానాల్లో నిలిచారు.

ఆర్చరీ కాంపౌండ్(బాలుర):

మోక్షాంశ్‌రెడ్డి ప్రథమ, అశ్విత్ ద్వితీయ, జోషిత్‌చంద్ర తృతియ స్థానాల్లో నిలిచారు.

హ్యాండ్‌బాల్ (బాలికలు):

ఖమ్మం కార్పోరేషన్ జట్టు ప్రథమ, ఇల్లందు జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

వాలీబాల్ (బాలికలు):

ఖమ్మం కార్పోరేషన్ జట్టు ప్రథమ, కల్లూరు జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

ఫుట్‌బాల్

రఘునాధపాలెం జట్టు ప్రథమ, ముదిగొండజట్టు ద్వితీయస్థానాలుసాధించగా బాలుర విభాగంలో రఘునాధపాలెం జట్టు ప్రథమ, కూసుమంచి జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

నెట్‌బాల్:

ఖమ్మం కార్పోరేషన్ జట్టు ప్రథమ, తిరుమలాయపాలెం జట్టు ద్వితీయ స్థానాలు సాధించగా బాలుర విభాగంలో ఖమ్మం కార్పోరేషన్ జట్టు ప్రథమ, తిరుమలాయపాలెం జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచింది.

22న జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీ

ఖమ్మంరూరల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): గురుదక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా స్థాయిలో 22న సైన్సు క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఖమ్మం రూరల్ మండలం, పోలేపల్లి పరిధిలోని గురుదక్షిణి ఫౌండేస్‌లోఈ పోటీలు నిర్వహిస్తామని ఫౌండేషన్ కార్యదర్శి చావా సత్యనారాయణ ప్రసాద్ గురువారం ఓప్రకటనలో తెలిపారు.ప్రముఖ గాంధేయ వాది చేకూరి కాశయ్య మరియు యస్.వి.నారాయణ జ్ఞాపకార్థం భారతీయ గణిత మేథావి శ్రీనివాస రామానుజం జన్మదినం పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఒక పాఠశాల నుంచి ఐదు జట్లకు అవకాశం ఉందన్నారు.ఒక జట్టులో ఇద్దరు విద్యార్థులు ఉండాలన్నారు. ఆసక్తిఉన్న విద్యార్థులు 9246273275 నెంబర్‌కు ఫోన్ చేసి డిసెంబరు 21వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి ఫీజు లేదని తెలిపారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తామని చెప్పారు.

స్థానిక సంస్థల్లో గెలవండి

- 100 రోజుల్లో గ్రామాభివృద్ధి చేసి చూపిస్తా
- పగిడేరు సమావేశంలో కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

మణుగూరుటౌన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ మీకు అండగా ఉంటుంది.. స్థానిక సంస్థల్లో గెలవండి, గెలిచిన గ్రామాల్లో 100 రోజుల్లో అన్నిమౌలిక సదుపాయలను కల్పించి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా అని ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ స్పష్టం చేశారు. గురువారం భద్రాద్రి జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండలం పగిడేరు గ్రామంలో సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు స్థానిక గ్రామస్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పాలన 54 సంవత్సరాలు చూశారు కానీ గ్రామాలు మారలేదన్నారు. 12 మంది రెడ్డి ముఖ్యమంత్రులను చేశారు.. కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీలను చేయలేదన్నారు. మనం కులాలకు మతాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడటం వల్లే గద్దరన్న ప్రజాశాంతి పార్టీలో చేరారన్నారు. ప్రజాశాంతి పార్టీలో గెలిచిన ఆయా గ్రామాల్లో లేదా పంచాయతీల్లో అభివృద్ధి అంటే ఏమిటో 100 రోజుల్లో చేసి చూపిస్తామన్నారు. ఇక దేశంలో అయితే చేసిన అప్పులు ఒక్కో కుటుంబం మీద రూ.5 కోట్లు ఉంటుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం తర్వాత కాంగ్రెస్ నేను అభివృద్ధి చేస్తానంటే అందరూ నమ్మి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి గెలిపించారని అన్నారు. ఈ సంవత్సరం అభివృద్ధి లేదు సరికదా మరో రూ.లక్ష కోట్ల అప్పులు పెరిగాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజా శాంతి పార్టీ నాయకులు నిర్వాహకులు పాల్గొన్నారు.

బయటి ధాన్యాన్ని తరలిస్తున్నారని లారీ అడ్డగింత



పెనుబల్లిలో వేరే ప్రాంతంలో లోడింగ్ చేస్తున్న లారీని అడ్డుకున్న రైతులు

పెనుబల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత 20రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి ఆరబెట్టుకోగా పదిరోజుల క్రితం కాంటాలు వేసినప్పటికీ ఆధాన్యాన్ని ఎగుమతి చేయకుండా, బయట ధాన్యాన్ని తరలిస్తున్నారని ఆరోపిస్తూ పలువురు రైతులు లారీలను అడ్డుకున్న సంఘటన పెనుబల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పెనుబల్లిలోని కొనుగోలు కేంద్రానికి సుమారు పది లారీల ధాన్యాన్ని గ్రామంలోని రైతులు 20రోజుల క్రితం తీసుకువచ్చి ఆరబెట్టారు. ఐకేపీ సిబ్బంది కాంటాలు వేశారు. ఈ ధాన్యాన్ని తరలించేందుకు క్వింటాకు ఐదు నుంచి పదికేజీలు తరుగు తీయాలని మిల్లర్లు అడుగుతున్నారని అవి ఇస్తేనే ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని ఐకేపీ సిబ్బంది చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం పెనుబల్లికి వచ్చిన కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సివిల్‌సప్లయి అధికారులతో మాట్లాడి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఈమేరకు గురువారం రాత్రి కొనుగోలు కేంద్రానికి లారీ చేరింది. ఈ లారీలో కేంద్రంలో కాంటాలు వేసిన ధాన్యాన్ని కాకుండా ఇతర ప్రాంతంలో ఉన్న ధాన్యాన్ని ఐకేపీ సిబ్బంది లోడింగ్ చేస్తుండటంతో కాంటాలు వేయించిన రైతులు లారీని అడ్డుకొని కేంద్రంలోని ధాన్యాన్ని తరలించిన తర్వాతనే ఇతర ప్రాంతంలోని ధాన్యాన్ని తరలించాలని పట్టుబట్టారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాంటాలు వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ముదిగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసిస్టు స్టోర్, స్టాక్ రిజిస్టర్, డెలివరీ, వ్యాక్సిన్ రూమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ చంద్రప్రకాష్, ఫార్మాసిస్టు సత్యావతి, స్టాఫ్‌నర్సు కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు ఓసీ-2లో

డంపర్ బోల్తా పడి ఆపరేటర్ మృతి



మూల్‌చంద్(ఫైల్)

మణుగూరు , డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మణుగూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గనిలో డంపర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఓసీ-2 గనిలో డంపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మూల్‌చంద్(60) గురువారం మొదటి షిఫ్టులో తనకు అప్పజెప్పిన 100 టన్‌డంపర్‌ను తీసుకుని కోల్ డంపింగ్ యార్డుకు చేరుకున్నాడు. అక్కడ డంపర్‌ను వెనక్కు నడిపిస్తూ అన్‌లోడ్ చేసే క్రమంలో వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. వాహనం క్యాబెన్ అద్దాలు పగిలిపోవడంతో బయటపడ్డ డ్రైవర్ మూల్‌చంద్ అక్కడ ఉన్న రాళ్లకు అతడి తల తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదాన్ని గుర్తించిన కార్మికులు, స్థానిక అధికారులు వెంటనే అతడిని మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మూల్ చంద్ అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

కార్మిక సంఘాల నాయకులు కృష్ణం రాజు, వైరాంగోపాల్ ఇతర నాయకులు కార్యకర్తలు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. జరిగిన ప్రమాదంపై యాజమాన్యం సత్వరమే విచారణ జరపాలని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ గురువారం సాయంత్రం ఏరియాలో పర్యటించి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. డిప్యూటీ డైరక్టర్ మైన్స్ సేఫ్టీ (మెకానికల్) కూడా జరిగిన ప్రమాదంపై విచారణ నిర్వహించేందుకు రానున్నట్లు తెలిసింది. ఏడాదిన్నర క్రితమే కొత్తగూడెం నుంచి డిప్యూటేషన్‌పై మణుగూరుకు వచ్చిన మూల్‌చంద్ మరో 8 నెలలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తల్లాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తల్లాడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మఝ్దార్‌నగర్‌కు చెందిన భలేంద్ర విశ్వకర్మ(28) మూడునెలల క్రితం అక్కడి నుంచి వచ్చి నర్సింహారావుపేట గ్రామసమీపంలోని ఓ క్వారీలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల వల్ల మదనపడుతున్న విశ్వకర్మ బహిర్భూమికి అని వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. సూపర్‌వైజర్ పొన్నా రామకోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాచలంలో

వరద కష్టాలకు చెక్

- కరకట్ట విస్తరణకు రూ.4,500 కోట్లతో అంచనాలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన నీటిపారుదల శాఖ అధికారులు
- పోలవరం బ్యాక్ వాటర్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

భద్రాచలం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఆ బ్యాక్ వాటర్‌తో తెలంగాణలోని భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం తదితర మండలాలకు ముంపు సమస్య పొంచి ఉందని సాగునీటిరంగ నిపుణులు గత కొంత కాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో సాగునీటిరంగ నిపుణుల కమిటీ సైతం గోదావరికి ఇరువైపులా కరకట్టలను నిర్మిస్తే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

దీంతో దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి దిగువన ఉన్న ఏపీ సరిహద్దులోని భద్రాచలం వరకు గోదావరికి ఇరువైపులా (అశ్వాపురం నుంచి బూర్గంపాడు వరకు) కరకట్టలను నిర్మించేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఇప్పటికే పరిశీలించి రూ.4,500 కోట్లతో అంచనాలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంకు పంపారు. మొత్తం మీద పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం భద్రాచలం ఏజెన్సీలోని మండలాలపై పడకుండా ఉండేందుకు అధికారులు నిపుణుల కమిటీ సూచన మేరకు కరకట్టల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాలని తెలిసింది.

గోదావరి ఇరువైపులా .....

గోదావరికి ఇరువైపులా కరకట్టల నిర్మాణం చేపట్టనున్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి ఏపీ సరిహద్దుకు చివరగా ఉన్న భద్రాచలం వరకు కట్ట నిర్మాణం మరింత బలోపేతం చేయనున్నారు. అలాగే అశ్వాపురం నుంచి బూర్గంపాడు వరకు ఇదే రీతిలో నిర్మాణం చేపట్టనున్నారు. 15 మీటర్ల ఎత్తులో కరకట్ట ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే భద్రాచలంలో 110 ఇళ్లను తొలగించే అవకాశం ఉన్నట్లు వినికిడి.

గతంలో రూ.172.84 కోట్ల విడుదల

కాలం చెల్లిన గోదావరి కరకట్ట నిర్మాణ ప్యాకేజీలు గతంలో 2006లో గోదావరి ఉగ్రరూపాన్ని చూసిన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007 ఫిబ్రవరి 28న మూడు ప్యాకేజీలతో కరకట్ట పనులను నిర్వహించేందుకు రూ.172.84 కోట్లు విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన పనులను ప్యాకేజీ 72, 73, 74గా ప్రభుత్వం పేర్కొంది. కాగా 72, 73 ప్యాకేజీల కింద పనులు ప్రారంభం కాకుండానే నిధులు వెనుదిరిగాయి. కాగా 74వ ప్యాకేజీ కింద రూ.54.50 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉండగా 14.51 శాతం లెస్‌కు హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టరు చేజిక్కించుకోవడం జరిగింది. ఈ పనుల్లో భద్రాచలం మండలంలోని ఆ నాటి యటపాక నుంచి సుభాష్‌నగర్ కాలనీ వరకు కరకట్ట నిర్మాణ పనులను చేపట్టారు. అనంతరం ఆ పనులను సుభాష్‌నగర్ కాలనీ నుంచి శిశుమందిర్ వరకు చేపడుతుండగా రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఈ క్రమంలో ఇటీవల 700 మీటర్ల కరకట్ట పనులను సుమారు రూ.38 కోట్లతో చేపట్టారు.

ఈసారి అధికారులు పంపిన అంచనాలు రూ.4,500 కోట్లకు ప్రభుత్వ ఆమోదం లభిస్తుందా అనే అనుమానాలు సైతం భద్రాద్రివాసుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించే ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం లేకపోవడమే కారణమని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ పనులను పూర్తి చేయాలన్నా సుదీర్ఘ సమయం పట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే పోలవరం బ్యాక్ వాటర్ ముంపు సమస్య పొంచి ఉన్న క్రమంలో శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడతాయా అనేది వేచి చూడాల్సి ఉంది.



భద్రాచలంలో కట్ట విస్తరణ చేపట్టే ప్రాంతం



వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా రేగూరి



నేలకొండపల్లి,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడిగా నేలకొండపల్లికి చెందిన రేగూరి హనుమంతరావును అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా నామినేట్ చేశారు. కొన్ని సంవత్సరాలుగా వాసవీ క్లబ్స్‌కు హనుమంతరావు చేసిన సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుళ్ల రామకృష్ణ ప్రమోట్ చేశారు. తమిళనాడులోని మధురైలోని తముకుమ్ కన్వెన్షన్‌లో జరిగిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో హనుమంతరావును అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, కొత్తా రమేష్, దోసపాటి చంద్రశేఖర్, యర్రా నాగేశ్వరరావు, మేళ్ళచెర్వు సర్వేశ్వరరావు తదితరులు రేగూరి హనుమంతరావుకు అభినందనలు తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	40
గుత్తి వంకాయ	38
బీరకాయ	68
పచ్చిమిర్చి	34
కాకరకాయ	54
బెండకాయ	50
పొట్లకాయ	50
దోసకాయ	34-48
చిక్కుడు	48
నాటుచిక్కుడు	94
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	28
దొండ	54-60
సొరకాయ	26
క్యారెట్	44
క్యాప్సికం	68
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్



వార్డు ఆఫీసర్లుగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు

కేఎంసీకి యువసైన్యం

గ్రూప్4లో 46మంది ఉద్యోగుల నియామకం

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పాలక సంస్థ యువ రక్తంతో పరిపాలనలో ఇక ముందుకు సాగనుంది. ఇప్పటి వరకు అవుట్ సోర్సింగ్, రెవెన్యూశాఖ, మున్సిపల్‌శాఖల నుంచి మూడు వర్గాలుగా విడిపోయి కేఎంసీ పాలకవర్గాన్ని ముప్పుతిప్పలు పెడుతున్న సీనియర్ ఉద్యోగులకు ఇక చెక్ పడనుంది. రాష్ట్రప్రభుత్వం ఇటీవల చేపట్టిన గ్రూప్4 ఉద్యోగ నియామకాలతో ఖమ్మం నగర పాలకకు ఉద్యోగులు కేటాయింపు చేశారు. ఒక్క ఖమ్మం నగర పాలక సంస్థకే గతంలో ఎన్నడు లేని విధంగా ఒకేసారి 46మంది యువ ఉద్యోగులను కేటాయించారు. దీంతో వారు గురువారం కేఎంసీలో కార్యాలయంలో రిపోర్టు చేశారు. 46 మందిలో 43 మందిని వార్డు ఆఫీసర్లుగా, మరో ముగ్గుర్ని జూనియర్ ఎకౌంటెంట్లుగా నియమిస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉద్యోగాల్లో చేరిన వారు వారికి కేటాయించిన విభాగాల్లో బాధ్యతలు చేపట్టారు.



చెట్టు నరికిన భాగాన్ని పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి రాధిక

చెట్టు నరికితే రూ.10 వేల జరిమానా

మొక్కల సంరక్షణపై దృష్టి సారించిన కేఎంసీ అధికారులు

ఖమ్మంసంక్షేమ విభాగం,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): వీధి ఎదుట చెట్టు కొమ్మలు ఇంటిపైకి వస్తున్నాయని, దాన్ని నరికేందుకు యత్నించగా, చెట్టు నేలకూలక ముందే ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు భారీ జరిమానా విధించారు. ఈ సంఘటన ఖమ్మంలో గురువారం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం నగరంలోని 49వ డివిజన్‌లో ఐదేళ్ల క్రితం తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా బాహినియా మొక్కలు నాటారు. అవి నేడు వృక్షాలుగా మారాయి. స్థానికులకు నీడతో పాటుగా ఆహ్లాదంగా ఉంటున్నాయి. అయితే చెట్టుకు సమీపంలోనే ఉన్న శ్రీనివాస్ గుప్తా కొమ్మలు ఇంటి మీదకు వస్తున్నాయని నరికేందుకు యత్నించాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక అక్కడకు చేరుకొని రూ.10వేలు జరిమానా విధించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వృక్షాలను నరికితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

డిజిటల్ తరగతులకు విరాళం

మైనారిటీ గురుకుల కళాశాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ లక్ష అందజేత

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మైనారిటీ జూనియర్ గురుకుల కళాశాల విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలను పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఖమ్మంలోని మైనారిటీ జూనియర్ బాలికలు-1 కళాశాలకు సుమారు లక్షరూపాయలు అందించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అఖిల తెలిపారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబురు దయాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, డిజిటల్ పరికరాలను ప్రారంభించారు. పాలేరు నియోజకవర్గంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలను ఉన్నత ప్రమాణాలతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తీర్చిదిద్దుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజశేఖర్, 1వ డివిజన్ కార్పొరేటర్ తేజవత్ హస్సేన్, అనంత రాములు పాల్గొన్నారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	ప్రణయగోదావరి

ఆగిఉన్న లారీని ఢీ కొట్టిన మరో లారీ

» ఓ డ్రైవర్ దుర్మరణం

ఖమ్మంక్రైం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. వైరావైపు నుంచి హైదరాబాద్‌కు ఐరన్‌లోడ్‌తో వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ జమాలుద్దీన్(48)అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని లారీలను తొలగించారు. రెండు లారీలు రోడ్డుపై ఉండటంతో చాలా సేపటివరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అనంతరం మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించారు. బుధవారం ఉదయం డివైడర్‌ను ఢీకొట్టిన లారీని పోలీసులు తొలగించకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి పోలీసులు ఎందుకు లారీని తొలగించలేదని దీనివల్లనే ఒక ప్రాణం పోయిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే కొత్త బస్‌స్టాండ్ సమీపంలో కరెంట్ స్థంభాన్ని ఢీకొట్టిన లారీని కూడా రెండు రోజులపాటు రోడ్డు పక్కనే ఉంచారని

మండలాల్లో పాలన మరింత మెరుగుపడాలి

» రెవెన్యూ శాఖ పని తీరును సమీక్షించిన కలెక్టర్



భక్తరామదాసు కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలో పరిపాలనపై తహసీల్దార్లు పట్టు సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూశాఖ పనితీరుపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి సమీక్షించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు, ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, మీసేవా దరఖాస్తులు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఓటర్ల జాబితా తయారీ, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సంక్రాంతి లోగా ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. జిల్లాలో 4,400 ధరణి దరఖాస్తులు పెండింగ్ ఉంటే వీటిలో దాదాపు 2400 దరఖాస్తులు ఫిజికల్ ఫైల్ అందక కారణంగా పెండింగ్ ఉన్నాయని, వీటిని పూర్తి చేసేందుకు ఫైల్స్‌ను రెవిన్యూ డివిజన్ అధికారి,అదనపు కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాలకు అందించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శనలో బియ్యం నాణ్యత, ఆహార సామాగ్రి భద్ర పరిచే స్టోర్ రూమ్ ను తప్పనిసరిగా పరిశీలించాలని, దుప్పట్లు ఉన్నాయా, దోమల నుంచి రక్షణకు తీసుకుంటున్న చర్యలు చేపట్టాలని, చిన్న, చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారులు నర్సింహారావు, రాజేందర్, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తరామదాసు కళాక్షేత్రం పనులకు డీపీఆర్ సిద్ధం చేయాలి

నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆధునికీకరించేందుకు డీపీఆర్ తయారు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన కళాక్షేత్రాన్ని సందర్శించారు. ప్రూఫ్ లీకేజీ, మరమ్మతు పనులు, ఎంట్రీ కలర్ వాష్ పనులను పరిశీలించారు. కళా క్షేత్రాన్ని ఆధునీకరించి ప్రైవేట్ ఫంక్షన్‌హాల్ కు దీటుగా సిద్ధం చేయాలన్నారు. కళా క్షేత్రంలో ఇంటీరియర్ మరింత ఆకర్షణీయంగా చేయాలన్నారు. సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగుపరచాలని, వేదిక ఏర్పాటు, పూర్తి స్థాయిలో లైటింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. వీటికోసం హైదరాబాద్ నుంచి ఆర్కిటెక్చర్‌ను పిలిపించి డిజైన్ మోడల్ రూపొందించి డీపీఆర్ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిప్యూటీ ఇంజనీర్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ మానవత్వం

పల్లీలు అమ్ముకునే దివ్యాంగురాలికి రూ.లక్ష రుణం

ఖమ్మంసంక్షేమ విభాగం:ఖమ్మంగాంధీచౌక్ చౌరస్తాలో దివ్యాంగురాలు కమలమ్మ నాల్గు చక్రాల బండిపై పల్లీలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఐదురోజుల క్రితం ఖమ్మం నగరంలో పర్యటించిన కలెక్టర్ దివ్యాంగురాలు కమలమ్మ వద్ద కారులో ఆగారు. కలెక్టర్ అంటే ఎవ్వరో తెలియని జమలమ్మ పల్లీలు కావాలా సార్ అని అడగటంతో... ఓ చిరునవ్వు నవ్వారు. దివ్యాంగురాలు జమలమ్మ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. నేను మా అమ్మ మాత్రమే ఉన్నాం సార్ అంటూ తన దుర్భర జీవితాన్ని వివరించింది. స్పందించిన కలెక్టర్.. నీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పి వెళ్లారు. తర్వాత కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫోన్ చేసిన కలెక్టర్, జమలమ్మకు రుణం అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు మెప్మా డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, సీఓ రోజా ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న బ్యాంకరుతో మాట్లాడి కేవలం ఐదురోజుల్లోనే రూ.1లక్ష వ్యాపార రుణం చెక్కును గురువారం అందించారు. త్వరలో జమలమ్మతో కూరగాయాల వ్యాపారం ఏర్పాటు చేసేందుకు కార్యచరణ చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని జాంబవారసుల గ్రూపు ఆధ్వర్యంలో నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో మరికంటి కన్నారావు, బుర్ర ఉపేంద్రసాహు,పెనుగూరి కోటేశ్వరరావు, ఆరెంపుల అంబేద్కర్, కేదాస్‌కృష్ణ, నెమలి కిషోర్, మాతంగి అనిల్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో నగరంలోని జడ్పీసెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్, నగద్దల చంద్రయ్య, సగ్గుర్తి కోటేశ్వరరావు, కనకపుడి వీరస్వామి, వెంకయ్య బెల్లంకొండ శ్యామల, కొండపల్లి మధు తదితరులు పాల్గొన్నారు. మాలమహానాడు ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నగరంలోని జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ పేరం మల్లయ్య, గుంతేటి వీరభద్రం, లింగాలక మల్‌రాజ్, తలారి రాధాకృష్ణ, కొట్టే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్, జాంబవారసుల గ్రూపు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం: అంబేద్కర్‌పై కేంద్రహోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గురువారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డగించి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్‌గౌడ్, బోడ్డు బొందయ్య పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా తిరుమలాయపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. పార్టీ పాలేరు అధ్యక్షుడు మట్టే నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని దేశప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నబోయిన రమేష్, కొమ్ము పూలే, మల్సూరు, శ్రీకాంత్, నాగరాజు,గోపి పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న సీపీ సునిల్‌దత్

సెమీక్రిస్మస్ వేడుకలు

ఖమ్మంక్రైం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు గురువారం నిర్వహించారు. పోలీస్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి సీపీ సునీల్‌దత్ హాజరై క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీనిధి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రఘునాథపాలెం,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం వీ-వెంకటాయపాలేంలో శ్రీనిధి హాస్పటల్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పెద్దిరెడ్డి ప్రియాంక 190 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, మధుమేహం పరీక్షలు చేశారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హాస్పటల్ నిర్వాహకులు బాబురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

22న మోటారు కార్మికుల రాష్ట్ర మహాసభలు

ఖమ్మంసంక్షేమ విభాగం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రగతిశీల మోటారు వాహన కార్మికుల రాష్ట్ర రెండో మహాసభలు ఈనెల 22న హైదరాబాద్‌లో జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, అక్కి నాగరాజు, గుడిసెట్టి మాధవరావు, యడ్లపల్లి సతీష్, బీ నరేశ్, మురళీకృష్ణ, లక్ష్మయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు.. మూడు నెలల జైలు

ఖమ్మంలీగల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల గ్రామానికి చెందిన దారా శేషయ్య, దారా నాగభూషణం, దారా యల్లయ్య, బొప్పిని శ్రీను, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి లక్ష్మయ్యకు మూడు నెలల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు చొప్పున జరిమానా విధించారు. ఈ మేరకు ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పుచెప్పారు. ఫిర్యాది గంజి వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గుదిమళ్ల గ్రామంలో సర్వే నెంబర్ 159, 161 లోగల 26ఎకరాల భూమి ఉంది. అట్టిభూమిని మిషన్ భగీరథ వారు ఆక్రమించుకుంటున్నారని, హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2016లో రెవిన్యూ అధికారులు సర్వేచేసి హద్దులు నిర్ణయించారు. పైన పేర్కొన్న నిందితులు ట్రాక్టర్‌తో రెవెన్యూ అధికారులు నిర్ణయించిన హద్దులను ధ్వంసం చేశారు. అసభ్యంగా తిట్టారని ఖమ్మం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలుచేశారు. కేసును విచారించిన న్యాయాధికారి పై విధంగా తీర్పుచెప్పారు. ఒకటో నిందితుడు దారా శేషయ్య కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ను జారీ చేశారు.

మొగిలయ్య మృతిపట్ల నామా సంతాపం

ఖమ్మంటౌన్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన జానపద కళాకారుడు మొగిలయ్య మృతిపట్ల ఖమ్మం మాజీఎంపీ నామా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. బలగం సినిమాలో తన గాత్రంతో మొగిలయ్య ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారని నామా గుర్తు చేశారు. జానపద రంగానికి ఆయన సేవలు మరవలేనివన్నారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా గుడవర్తి



నేలకొండపల్లి,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మండల పరిధిలోని అనాసాగరం గ్రామానికి చెందిన గుడవర్తి నాగేశ్వరరావు రెండోసారి ఎన్నికయ్యారు. రెండు రోజులుగా సత్తుపల్లిలో జరుగుతున్న పార్టీ 22వ మహాసభలో ఈఎన్నిక జరిగింది. గుడవర్తి నాగేశ్వరరావు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా తిరిగి ఎన్నిక గావటం పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

తిరుమలాయపాలెం: సీపీఎం జిల్లా కమిటీ సభ్యులుగా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొమ్ము శ్రీను ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో జరిగిన సీపీఎం జిల్లా మహాసభల్లో జిల్లా కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. 42 మందితో జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా కమిటీసభ్యులుగా తిరుమలాయపాలెం సీపీఎం మండల కార్యదర్శిగా పనిచేస్తున్న కొమ్ము శ్రీను నియమితులయ్యారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూన్సీ సౌజన్య, జిల్లా అధ్యక్షుడు షేక్ మహాబూబ్‌పాషా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయ్, యలమద్ది వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలి

కామేపల్లి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి డి. పుల్లయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని కొత్తలింగాల, కామేపల్లి దార్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కిషోర్‌బాబు, ఏఈఓ శ్రీకన్య ఉన్నారు.

కన్నీటి సంద్రంగా కొయచెలక

రఘునాథపాలెం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):వైరా వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో రఘునాథపాలెం మండలం కొయచెలకకు చెందిన చెరుకూరి శ్రీహర్ష మృతి చెందటం తెలిసిందే.. గురువారం కొయచెలకలో అంత్యక్రియలు జరిగాయి. ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ బాధిత కుటుంబానికి రూ.5వేలుఅందించారు. కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, భూక్య భాషానాయక్, కొంటేముక్కల నాగేశ్వరరావు, నర్సిరెడ్డి, మాధంశెట్టి హరిప్రసాద్ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్‌జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆలిండియా బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ సపావత్ రాములునాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంనగరంలోని బంజారభవన్‌లో ఆలిండియా బంజార సేవసంఘ్ జిల్లా కమిటీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజార గోర్‌బోలి బాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. మంత్రివర్గంలో బంజార ప్రతినిధులకు అవకాశం కలిపించాలని, హతీరాం బావాజీ మఠం ఆస్తులను పరిరక్షించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలిండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తినాయక్, అమర్‌సింగ్‌పవర్, కిషన్‌సింగ్, జర్పుల బీముడు నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, దశరధ్‌నాయక్,తేజావత్ పంతులునాయక్ పాల్గొన్నారు.

అరకొరగా సాగర్ నీరు

» చివరి భూములకు అందని సాగునీరు » అవస్థలు పడుతున్న ఆయకట్టు రైతులు



కల్లూరు డివిజన్‌కు తక్కువగా వస్తున్న సాగర్‌నీరు

కల్లూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కల్లూరు డివిజన్ సాగర్ ఎడమ కాల్వ ద్వారా అరకొరగా సాగునీరు సరఫరా కావడంతో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. డిసెంబరు నెల ప్రారంభం నుంచి సాగర్ ఎడమకాల్వ పరిధిలో రైతులు రెండవ పంటగా యాసంగి వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వెదజల్లే పద్ధతిపై ఎక్కువ శాతం రైతులు వరి సాగు చేయగా, మరి కొంత మంది వరి నాట్లు వేసే విధానంలో వరిసాగు చేస్తున్నారు. ఈ దశలో వరి సాగులో దమ్ము చేసి దుక్కిలు సిద్ధం చేసేందుకు సాగునీటి ఆవశ్యకత ఉంది. ఈ దశలో సాగర్ ఎడమకాల్వపై ఎగువ భాగం నుంచి ఈ డివిజన్ పరిధిలో స్థిరీకరణ చేసిన సాగు అవసరాలకు అణుగుణంగా నీరు అందకపోవడంతో కాల్వ చివరన గల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వాస్తవంగా పాలేరు రిజర్వాయర్ నుంచి కల్లూరు డివిజన్‌కు కనీసం 1,500 క్యూసెక్కుల వరకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే ఇక్కడ నుంచి మధిర బ్రాంచ్ కాల్వకు కనీసం 800 క్యూసెక్కుల నీరు అందిస్తే చివరి భూములకు నీరు అందే అవకాశం ఉంది. అందుకు భిన్నంగా డివిజన్ పరిధిలో సాగర్ ఎడమకాల్వపై 72 కిమి రెగ్యులేటర్ల వద్ద 821 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుందని తెలిసింది. దీంతో ఇక్కడ నుంచి మధిర బ్రాంచ్ కాల్వకు 518 క్యూసెక్కులు, ప్రధాన కాల్వకు 336 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నాయి. వాస్తవంగా మధిర బ్రాంచ్ కాల్వకు కనీసం 800 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తు చివరి భూములకు నీరు అందుతుంది. ప్రధాన కాల్వకు 500 నుంచి 700 క్యూసెక్కులు సరఫరా చేయాల్సి ఉంది. ఈ డివిజన్‌కు గాను స్థిరీకరణ చేసిన ఆయకట్టు ప్రకారం మొత్తం మీద 1,500 క్యూసెక్కుల సాగునీటి డిమాండ్ ఉంది. ఈ పరిస్థితుల దృష్ట్యా సాగర్ ఎడమ కాల్వ పరిధిలో చివరి ప్రాంతానికి సాగునీరు అందని పరిస్థితి. అసలే యాసంగి సాగులో ఎంతో ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతుల భూములకు సాగునీరు అందక నిరాశ పడుతున్నారు. ఇలాంటి పరిస్థితితుల్లో సాగర్ ఎడమకాల్వపై ఉన్న ఉప కాల్వల తూములకు కూడా నీరు అందని పరిస్థితి. ఇప్పటికే కల్లూరు డివిజన్ పరిధిలో పుల్లయ్య బంజరు, తూర్పులోకరం, చంద్రుపట్ల, లింగాల, ఎర్రబోయనపల్లి, రఘునాథబంజరు, వెన్నవల్లి, ఆంధ్ర ప్రాంతంలో గల మునుకొళ్ల, ఎర్రమాడు, వావీలాల, తెలంగాణలో గల మధిర ప్రాంతానికి సాగునీరు అందని పరిస్థితి నెలకొన్నదని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. అధికారులు ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందే విధంగా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

కల్లూరు డివిజన్‌కు 1500 క్యూసెక్కుల నీరు అవసరం

● ఈఈ లక్ష్మీనారాయణ

జలనరులశాఖ కల్లూరు డివిజన్‌లో స్థిరికరణ చేసిన ఆయుకట్టు ప్రకారం యాసంగి సాగుకు సగటున ప్రతి రోజు 1500 క్యూసెక్కుల నీటి అవశ్యకత ఉంది. డివిజన్‌లో నీటి అవశ్యకతపై పై అధికారులకు కూడా ప్రతిపాదనలు పంపించడం జరిగింది. సాగర్ ఎడమ కాల్వపై నుంచి కల్లూరు డివిజన్‌కు తక్కువగా నీరు వస్తుందన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండా పార్టీలే

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఏన్కూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహించేది ఎర్రజెండా పార్టీలేనని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయ అవరణలో అమరనేని వీరభద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్, జిల్లా సమితి సభ్యులు తెప్పల సత్యం, మాదినే ని వెంకన్న, నరసింహారావు, రాజు, లక్ష్మయ్య, ఇరపా సురేష్, గోగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టుల పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతున్నాయని సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమవంతరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని క్రాస్ రోడ్డులో కారేపల్లి, కామేపల్లి మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఏపూరి లతాదేవి, పుచ్చాకాయల వెంకటేశ్వర్లు, ఉంగరాల సుధాకర్, బొమ్మ ల కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుల అరెస్టు



సత్తుపల్లిలో అరెస్టైన మాలమహానాడు నాయకులు

సత్తుపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గురువారం హైదరాబాద్‌లో జరిగిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లి మాల మహానాడు నాయకులు కోపల్లి రత్తయ్య, పిల్లి మల్లిఖార్జునరావులను బుధవారం రాత్రి సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తున్న మాలమహానాడు నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించి అరెస్ట్ చేయడం అమానుషమని, ప్రశ్నించే గొంతుకను నొక్కి వేయడం రాజ్యాంగ విరుద్ధమని నాయకులు అన్నారు. మాల జాతికోసం మాల తరాల భవిష్యత్ కోసం తాము దేనికైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

సత్తుపల్లి ఏఎంవీఐగా దినేష్



సత్తుపల్లిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ఏఎంవీఐగా జీ.దినేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం జిల్లాల్లో ఏఎంవీఐ అధికారుల నియామకాలు చేపట్టగా, ఈయన సత్తుపల్లికి రాగా ఆయన గతంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఉద్యోగిగా పనిచేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : నేడు సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25962 నంబర్‌కు సాయంత్రం 3గంటల నుంచి 4గంటల వరకు ఫోన్ చేయాలని ఆమె కోరారు.

మధిర ఆర్టీసీలో...

మధిర, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మధిర ఆర్టీసీ డిపోలో ఈనెల 20వతేదీ శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు గంట పాటు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25961కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు తెలపాలని కోరారు.

కల్లూరు ఎస్ఐగా హరిత



కల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి. హరిత గురువారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్ జిల్లా సీపీ కార్యాలయం నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గత పక్షం రోజుల క్రితం నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టు ఎట్టకేలకు భర్తీఅయింది.

అయ్యప్పస్వాములకు వితరణ

కారేపల్లి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయిబాబామందిరంలో అయ్యప్ప స్వాములకు జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ సంఘం నేత ఎస్‌కె. గౌస్‌ద్దీన్ రూ.పదివేలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ కులమాతాలకు అతీతంగా సేవా మార్గంలో ప్రయాణం చేస్తు తనకు తోచిన ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు గోడుగు శ్రీనివాస్, బాలకృష్ణ, కోమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐహెచ్‌ఆర్ఎన్‌ఈ అధ్యక్షుడిగా కటుకూరి



కల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) ఆల్‌ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ జాతీయ స్థాయి కార్య నిర్వహక అధ్యక్షుడిగా కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన కటుకూరి రత్నతారక రాజన్న నియమితులయ్యారు. ఆ సంస్థ ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ పెండం సురేష్‌కుమార్, మహిళ విభాగం ఛైర్మన్ డాక్టర్ ఫిలోమినాలు గురువారం హైదరాబాద్‌లో రత్నతారకకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రత్నతారక రాజన్న మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానని పేర్కొ న్నారు. జాతీయ స్థాయి లో తనకు ఏఐహెచ్‌ఆర్ఎన్‌ఈ అధ్యక్షుడిగా ఎంపికి చేసిన సంస్థ వ్యవస్థాపకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చర్చి నిర్మాణానికి రూ.లక్ష వితరణ

కల్లూరు, డిసెంబరు19(ఆంధజ్యోతి) మండల పరిధిలోని పాతయర్రబోయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి గురువారం లింగాల గ్రామ మాజీ సర్పంచ్ దేవరపల్లి అరుణ, నాగప్రసాద్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దేవరపల్లి పట్టాభి సదరు నగదును వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వేము కృష్ణ, నలజాల హరీష్, వేపూరి హరీష్, దేవరపల్లి కిషోర్, సాయి, మోహనరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాల విక్రయాలపై తనిఖీలు

వైరా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి ఆధ్వర్యంలో గురువారం మత్తుపదార్థాల నిరోధక కమిటీ సభ్యులతో కలిసి మత్తుపదార్థాల విక్రయాలపై తనిఖీలు నిర్వహించారు. జూనియర్ కాలేజీ పరిసరాల్లోని పాన్‌షాపులు ఇతర దుకాణాలను సందర్శించి అక్కడ విక్రయించే గుట్కా ఇతర మత్తు పదార్థాలను పరిశీలించారు. కాలేజీ పరిసరాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు పొగాకు, మత్తు కలిగించే పదార్థాలను విక్రయించొద్దని పాన్‌షాపులు, ఫ్యాన్సీ, బడ్డీకొట్ల వారిని హెచ్చరించారు. కమిటీ సభ్యులైన అధ్యాపకులు జీ.శంకర్, ఎస్.స్వప్న, వై.కవిత, గ్రంథ పాలకుడు నక్కా ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎర్రుపాలెం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో వివధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం ఆపార్టీ నాయకులు అందించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో ఆరుగురు లబ్ధిదారులకు రూ.2,09,000ల విలువగల చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పీసీసీ సభ్యులు శీలం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణ్‌రావు, బాబురావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో దేశభక్తి పెరుగుతుంది

» ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ షేక్.భద్రా



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ సీఈవో భద్రా

వైరా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ శిక్షణ వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, దేశరక్షణ, జాతీయతాభావం, సామాజిక సేవ వంటి మంచి లక్షణాలు అలవడతాయని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ షేక్. భద్రా అన్నారు. గురువారం వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ జూనియర్ కాలేజీని సందర్శించారు. ఇటీవల 11(టీ)వ బెటాలియన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో న్యూలిటిల్‌ఫ్లవర్ జూనియర్ కాలేజీకి ఎన్‌సీసీ సర్టిఫికెట్‌ను ఢిల్లీలోని హెడ్‌క్వార్టర్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఎన్‌సీసీ అధికారి అయిన భద్రా జూనియర్ కాలేజీని సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో ఎస్.నర్సింహారావు, ఎన్‌సీసీ ట్రైనర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్కాతమ్ముళ్లు

తల్లాడ, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రంగంబంజర గ్రామానికి చెందిన అక్కాతమ్ముళ్లు సీఎం కప్ రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. గురువారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో అత్యంత ప్రతిభను కనపరిచి అక్కా, ఇద్దరు తమ్ముళ్లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రంగంబంజరకు చెందిన ధర్మసోత్ సింధుప్రియా అథ్లెటిక్స్‌లో 400మీటర్ల పరుగులో, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో ప్రతిభ చూపగా, అనిల్‌కుమార్‌నాయక్ అథ్లెటిక్స్‌లో ట్రై అఫ్ లాన్‌సీలో ద్వితీయ స్థానం సాధించాడు. ధర్మసోత్ రామ్ చరణ్‌నాయక్ జూడోగేమ్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈనెల 27న హన్మకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు అక్కాతమ్ముళ్లు ఎంపిక కావడం పట్ల ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.



డీవైఎస్‌వో నుంచి మెడల్ అందుకుంటున్న సింధుప్రియా



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న చరణ్‌గౌడ్

కొణిజర్లలో...

కొణిజర్ల, డిసెండరు19(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో కొణిజర్ల మండలం పెద్దమునగాలకు చెందిన వేములకొండ చరణ్‌గౌడ్ మొదటి బహుమతి గోల్డ్‌మెడల్‌ను సాధించి రాష్ట్రస్థాయిలో జరిగే అండర్-14 విభాగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా చరణ్‌గౌడ్‌ను మండలాధికారులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. అతని తండ్రి వేములకొండ రమేష్ కొణిజర్ల మండల సీపీఐ కార్యదర్శిగా పని చేస్తున్నాడు.

'ఇందిరమ్మ' ఇళ్ల సర్వే పరిశీలన

మధిర రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను గురువారం మండల స్పెషలాఫీసర్ ఏ.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితంగా నమోదు చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు, అంగన్‌వాడీ టీచర్ స్వరాజ్యలక్ష్మి, సావిత్రి, ప్రసన్న పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గౌరిగూడేనికి చెందిన వనమారెడ్డి బాలకృష్ణారెడ్డి (37) కుటుంబ కలహాలతో ఈనెల 16వ తేదీన క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వైరా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం-పుణ్యపురం గ్రామాల మధ్య గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వైరా మండలంలోని గరికపాడుకు చెందిన ఓర్సు శ్రీను, తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన పాషా ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ఓర్సు శ్రీను ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కుర్నవల్లికి ట్రాక్టర్ డ్రైవర్ పని కోసం వెళ్తుండగా కుర్నవల్లికి చెందిన మెకానిక్ పాషా ఖమ్మానికి వస్తున్న సమయం లో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యా యి. గాయపడిన వారిని 108వాహనంలో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

సిరిపురంలో పశువైద్యశిబిరం

మధిర రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలో సత్యసాయి సేవసంస్థ ఆధ్వర్యంలో గురువా రం పశువైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పశువులకు డాక్టర్ ఉమాకుమారి వైద్యం చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు వచ్చే పలు వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

» సీపీఐ జిల్లా నాయకుడు ఆదినారాయణ

కల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) పార్లమెంట్ సమావేశాలు సందర్భంగా రాజ్యసభలో భాతర రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భాతర జాతికి క్షమాపణ చెప్పాలిని సీపీఐ జిల్లా నాయకుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. గురువారం కల్లూరులో ఏర్పాటు చేసిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల సీపీఐ కార్యదర్శి దమాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40కోట్ల మంజూరు



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న వెంకటనర్సిరెడ్డి

వైరా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గానికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవతో వివిధ గ్రాంట్ల కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40కోట్ల నిధులు మంజూరు అయ్యాయని వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. మండలంలోని గన్నవరం గ్రామంలో గురువారం స్థానిక అధికార సిబ్బంది, ప్రజలతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎ మ్మెల్యే చొరవతో సింగరేణి, కొణిజర్ల, వైరా, ఏన్కూరు మండలాలకు ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, ఈజీఎస్ కింద రూ.40కోట్లు మంజూరయ్యాయని వివరించారు. పంచాయ తీ కార్యదర్శి చిట్టిమోతు వెంకటేశ్వరరావు, నాయకులు యన్నం వెంకట కోటారెడ్డి, బండి వెంకటేశ్వరరావు, యరమల రవీంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కారేపల్లి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సింగరేణి గ్రామ పంచాయతీలో రూ.2.67 కోట్ల నిధులతో 57అంతర్గత సీసీ రోడ్లు ఏర్పాటు కోసం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కృషితో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయడంతో అభినందనీయమని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మేదరి వీరప్రతాప్(టోనీ)ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో షేక్ తాజుద్దీన్, యాకుబ్‌ఆలీ, షేర్, షఫి, మేదరిరాజు తదితరులున్నారు.

కందిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

» శాస్త్రవేత్తలు రుక్మిణిదేవి, నాగస్వాతి



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మధిర, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): కంది పంటలకు వ్యాధులు రాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి, కీటక శాస్త్రవేత్త డాక్టర్ నాగ స్వాతిలు అన్నారు. గురువారం డివిజన్‌లోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న కంది పంటలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా నల్లతామర కంది పంటను ఆశించి నష్టచేస్తుందని గుర్తించారు.

నివారణ చర్యలు:

ఫ్రిపోనిల్ 2.0మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

మారుకా పురుగు నివారణకు నోవాల్యూరాన్ 1మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3మి.లీ. లీటరునీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

పంట బెట్టకు గురైనట్లయితే 19-19-19 10గ్రా. లేదా యూరియా 20గ్రా. లేదా మల్టి కే 10గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి

పిందె దశలో నీటి తడి ఇచ్చినట్లయితే ఎక్కువ దిగుబడులు రావాడానికి ఆస్కారం ఉంటుంది. అలాగే నిండు పూత సమయంలో తడి ఇవ్వకూడదు. ఇచ్చిన యెడల పూత రాలి పోయే అవకాశం ఉంది. రైతులు ఈ విషయాలను గమనించి తక్షణమే తగిన విధంగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వైరా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 132కేవీఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ అన్నారుగూడెంలో మరమ్మతుల కారణంగా వైరా మండలంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు.

తల్లాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం అన్నారుగూడెంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 3గంటల వరకు మూడు మండలాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్‌పీడీసీఎల్ తల్లాడ ఏడీఈ ఎన్.సతీష్ తెలిపారు.

మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీక్

» వృథాగా తాగునీరు



పైప్‌లైన్ పగిలి ఎగిసిపడుతున్న నీరు

మధిరటౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం అమరవీరుల స్థూపం వద్ద పనులు చేస్తుండగా పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతుంది. నూతన పైప్‌లైన్ పక్కనే పాత మంచినీటి పైప్‌లైన్ ఉండటంతో ఎక్స్‌కవేటర్‌తో తవ్వే క్రమంలో మంచినీటి పైప్‌లైన్ పగిలి నీరుఎగిసిపడుతుంది.